క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

రాజోళి: మండల కేంద్రంలో శుక్రవారం చేనేత పారిశ్రామికుల సహకార ఉత్పత్తి సంఘం సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు దోత్రే నారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం కార్యాలయంలో ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. 2023–24 సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌పై సమావేశం నిర్వహిస్తునట్లు తెలిపారు.

ముగిసిన కబడ్డీ పోటీలు



అయిజ: మండలంలోని ఈడుగోనిపల్లిలో శ్రీరామ నవమి సందర్భంగా రెండు రోజులుగా నిర్వహించిన ఓపెన్ కబడ్డీ పోటీలు గురువారం రాత్రి ముగిశాయి. వివిధ మండలాల నుంచి వచ్చిన 28 జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. వడ్డేపల్లి మండలంలోని శాంతినగర్ జట్టు ప్రథమ బహుమతి రూ.30వేలు కైవసం చేసుకుంది. అదేవిధంగా రాజోళి మండలం పచ్చర్ల జట్టు రెండో స్థానంలో నిలిచి రూ. 20 వేలు, అయిజ మండలంలోని ఉత్తనూరు జట్టు మూడో బహుమతి రూ. 10 వేలు, నాల్గో బహుమతి రాజోళి మండలంలోని తుమ్మిళ్ల జట్టు నిలిచి రూ. 5 వేలు దక్కించుకుంది. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని షేకుపల్లి గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ ఖగన్నాథరెడ్డి ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి గురువారం షేకుపల్లి గ్రామానికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట జెడ్పీటీసీ హనుమంత్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు రంగారెడ్డి, లక్ష్మిరెడ్డి, పటేల్ విష్ణువర్ధన్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

టిప్పర్ల పట్టివేత



గద్వాల క్రైం: అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు టిప్పర్లను గురువారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఐ ఆనంద్ తెలిపిన వివరాల ప్రకారం రాయచూర్ నుంచి గద్వాల మీదుగా ఇసుకను టిప్పర్‌ల ద్వారా తరలిస్తున్నట్లు సమాచారం మేరకు గద్వాల – ఎర్రవల్లి రోడ్డు మార్గంలో తనిఖీలు చేపట్టాం. జమ్మిచేడ్ శివారులో టిప్పర్‌లో ఇసుక ఉన్నట్లు గుర్తించాం. అదేవిధంగా జగంపల్లి గ్రామ శివారులో మరో టిప్పర్ ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నాం. అనుమతి పత్రాలు లేకపోవడంతో వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. టిప్పర్ల యజమానులు మహేందర్‌గౌడ్, వడ్డె రాజశేఖర్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు శివారులోని అలంపూర్ చౌరస్తా సమీపంలో అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు టిప్పర్లు పట్టుకునట్లు ఎస్‌ఐ బాల్‌రాజు తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం కర్నూల్ జిల్లా సింగవరం నుంచి గురువారం రెండు ఇసుక టిప్పర్లు అలంపూర్ రోడ్డు మీదుగా ఉండవెల్లికి వెళ్తున్నాయి. ఈ క్రమంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలో భాగంగా ఇసుక టిప్పర్లు పట్టుబడ్డాయని తెలిపారు. టిప్పర్ యజమానులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పైపాడు గ్రామ సమీపంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. గురువారం రాత్రి 8 గంటల ప్రాంతంలో తుంగభద్ర నది నుంచి మద్దూరు మీదుగా పైపాడుకు ఇసుక తరలిస్తున్నారన్న సమాచారం మేరకు ట్రాక్టర్ అదుపులోకి తీసుకున్నారు. ఎటువంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఆర్థికసాయం అందజేత

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి గ్రామానికి చెందిన ఉప్పరి సుగ్రీవుడు గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎర్రవల్లి సర్పంచ్ జోగుల రవి మృతదేహంపై పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రూ. 10,000 ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట నాయకులు వెంకటన్న, రవి, అంజి, ఉన్నారు.



ఉండవెల్లిలో హాజరైన భక్తులు



రాజోళిలోని వాసవీ మాత ఆలయంలో..



శాంతినగర్‌లో..



ధరూరు ఆంజనేయ స్వామి ఆలయంలో..



గట్టు మండలం చిన్నోనిపల్లెలో..

కల్యాణ వైభోగమే..

జిల్లా వ్యాప్తంగా శ్రీరామ నవమిని పురస్కరించుకొని గురువారం రాములోరి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఆలయాలలో భక్తులు ఉదయం నుంచే ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణాలలో సీతారాముల విగ్రహాలను ఏర్పాటు చేసి శాస్త్రోక్తంగా కల్యాణ తంతును జరిపించారు. స్వామి వారి కల్యాణం తిలకించి భక్తులు పరవశించిపోయారు. భక్తులతో ఆలయ ప్రాంగణాలు కిటకిట లాడాయి. భక్తులకు ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు ఏర్పాటు చేశారు. అన్ని ఆలయాలలో అన్నదానం చేశారు. (సాక్షి, నెట్‌వర్క్)

- ధరూరులో ఆంజనేయ స్వామి ఆలయంతో పాటు మండలంలోని మార్లబీడు, జాంపల్లి, రేవులపల్లి, మాల్‌దొడ్డి, మన్నాపురం, నీలహళి, బూరెడ్డిపల్లితో పాటు వివిధ గ్రామాల్లో సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు.
- గట్టులో గండి ఆంజనేయస్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన ముత్యాల పందిరిలో అదేవిధంగా పెంచికలపాడు, యల్లందొడ్డి , బోయలగూడెం , చిన్నోనిపల్లె గ్రామాల్లోనూ స్వామివారి కల్యాణాన్ని భక్తులు తిలకించారు. ఈ సందర్భంగా మూడు బండ్ల గిరక పోటీలు ఏర్పాటు చేశారు.
- కేటీదొడ్డితో పాటు కొండాపురం, చింతలకుంట, ఇర్కిచేడు, నందిన్నె, గంగన్‌పల్లి, కుచినెర్లలో సీతారాముల వారి కల్యాణ మహోత్సవం వైభవంగా కొనసాగింది. అంతకుముందు స్వామివారిని పుర వీధుల్లో పల్లకీ సేవ నిర్వహించారు. ఇర్కిచేడులో నిర్వహించిన రథోత్సవానికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి హాజరయ్యారు.
- మల్దకల్‌తో పాటు తాటికుంట, అమరవాయి, బిజ్వారం, మల్దకల్, ఎల్కూరు, శేషంపల్లి, కుర్తిరావులచెర్వు, విఠలాపురం, పాల్వాయి, నీలిపల్లి, మద్దెలబండ, పెద్దొడ్డి, పెద్దపల్లి గ్రామాలలో సీతారాముల కల్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మద్దెలబండలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి హాజరై శ్రీరాముడికి ప్రత్యేక పూజలు చేశారు.
- శాంతినగర్‌తో పాటు సీతారామాలయం, మారుతీనగర్‌లోని ఆంజనేయస్వామివారి ఆలయం, రామాపురం రామాలయం, గాంధీనగర్ రామాలయం, వెంకట్రామనగర్ రామాలయం, తనగల సీతారామాలయం, కొంకల ఆంజనేయ స్వామివారి ఆలయాల్లో భద్రాద్రి రాముని కల్యాణ వేడుకలు అంగరంగ వైభవంగా కొనసాగాయి.
- ఉండవెల్లి మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయం, కోటాంజనేయ స్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణం వైభవంగా కొనసాగింది. ప్రాగటూరులో, మెనినపాడులో, పుల్లూరులో నిర్వహించిన రాములోరి కల్యాణానికి భక్తులు పోటెత్తారు.
- అయిజ పట్టణంలోని వివిధ కాలనీల్లో, మండలంలోని వివిధ గ్రామాల్లో వివిధ దేవాలయాల వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీరామ నవమి వేడుకలను నిర్వహించారు. స్వాగత తోరణాలు ఆకట్టుకున్నాయి. కిష్టాపురంలో నిర్వహించిన శ్రీరామ నామావళి గురువారం ముగిసింది.
- రాజోళిలోని వాసవీమాత ఆలయంలో శ్రీరామ నవమి వేడుకలు వైభవంగా కొనసాగాయి. వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన మామిడి తోరణాలు ఆకట్టుకున్నాయి.
- అలంపూర్ రూరల్ పరిధిలోని భీమవరంలో రాములోరి కల్యాణం తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వివిధ ఆలయాలలో భక్తుల సందడి నెలకొంది.
- మానవపాడులో మంగళ వాయిద్యాల మధ్య పల్లకీలో స్వామి వారి విగ్రహాలను ఊరేగించారు. పలు గ్రామాల్లో అన్నదానాలు, చేశారు. చెన్నిపాడు గ్రామానికి చెందిన జైపాల్‌రెడ్డి ఆంజనేయస్వామికి 1000 గ్రాముల వెండిని విరాళంగా ఇచ్చారు.



మల్దకల్ మద్దెలబండలో సీతారాముల కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



అయిజలోని ఉప్పలలో..



శాంతినగర్‌లో అమ్మవారి మంగళసూత్రాన్ని చూయిస్తున్న నిర్వాహకుడు



అయిజలోని కిష్టాపురంలో నిర్వహించిన శ్రీరామ నామావళిలో భక్తులు



కేటీదొడ్డిలో సీతారాముల కల్యాణం జరిపిస్తున్న దంపతులు



మానవపాడు చెన్నిపాడులో వెండిని ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు



గట్టులో నిర్వహిస్తున్న ఎండ్ల బండి గిరక పోటీలు

గొర్రెల దవాఖాన స్థలం కాపాడాలి

అమరచింత: పట్టణంలో ఎన్నో ఏళ్ల కింద గొర్రెల పెంపకందారుల జీవాల కోసం అప్పట్లో ఏర్పాటు చేసిన దవాఖాన స్థలం తమకే కావాలంటూ యాదవ సంఘం నాయకులు గురువారం శిథిల భవనం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈసందర్భంగా యాదవ సంఘం నాయకులు మాట్లాడుతూ ఏళ్లుగా తమ ఆధీనంలో ఉందని భావించిన స్థలాన్ని ప్రస్తుతం తమ సంఘానికి కాదని ఇతరులు కబ్జాచేసే ఆలోచనలో ఉన్నారని ఆరోపించారు. మున్సిపాలిటీ కేంద్రంలో గొర్రెల ఆరోగ్యం కోసం ప్రత్యేక దవాఖానను ఏర్పాటు చేయాల్సిన అధికారులు, ప్రజా ప్రతినిధులు ఉన్న స్థలాన్ని ఇతర అవసరాలకు, ఇతరులు ప్రయోజనాలకు ఇవ్వడానికి సిద్ధం కావడం తగదన్నారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ముదిరాజ్ రమేష్, పట్టణ అధ్యక్షుడు అక్కల నరసింహులుగౌడ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డితో సమస్యను విన్నవించి యాదవ సంఘం నాయకులకు, ప్రజలకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.



మాట్లాడుతున్న రమేష్

మజ్దూర్ కిసాన్ ర్యాలీ విజయవంతం చేయాలి

అలంపూర్: మజ్దూర్ కిసాన్ ర్యాలీని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి, అంగన్‌వాడీ వర్కర్స్ జిల్లా కార్యదర్శి ఏమెలమ్మలు కోరారు. గురువారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ర్యాలీకి సంబంధించిన పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏమెలమ్మ మాట్లాడుతూ ధరల పెరుగుదల నియంత్రణ తదితర డిమాండ్ల సాధనకు ఏప్రిల్ 5వ తేదీన చలో ఢిల్లీ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఎనిమిదేళ్లలో ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలు అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో నాగేశ్వరమ్మ, రేణుక, ఏసేపు, ఖలీల్, నాయుడు, మహేంద్ర, వీరన్న నాయుడు, రాజు, ఆటో డ్రైవర్లు, ఆశ వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే మెరుగైన వైద్యం



చికిత్స పొందుతున్న వారితో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మనోరమ

అలంపూర్: ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే మెరుగైన వైద్యం అందుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ అన్నారు. గురువారం రాత్రి ఆమె పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి పరిసరాలను పరిశీలించారు. రోగులను పలకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రితో అపరిశుభ్రత నెలకొందని విషసర్పాలు సంచరిస్తున్నాయని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో పిచ్చి మొక్కల తొలగింపు పనులు చేపట్టారు. ఆమె వెంట కౌన్సిలర్లు, వైద్యులు ఉన్నారు.

నాలుగు డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు

ఉండవెల్లి: మండలంలోని అలంపూర్ చౌరస్తాలో గురువారం రాత్రి పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. వాహనదారులకు బ్రీత్‌ఎనలైజర్ టెస్టులు నిర్వహించారు. ఇందులో మద్యం తాగినట్లు నలుగురిని గుర్తించారు. వీరిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాల్‌రాజు తెలిపారు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్ని హెచ్చరించారు. రోడ్డు నియమ నిబంధనలు పాటించాలని కోరారు. యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. తనిఖీలో పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'అభివృద్ధిని విస్మరించిన ప్రభుత్వం'

అమరచింత: రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధిని విస్మరిస్తోందని.. స్వాతంత్రం వచ్చి ఇన్నేళ్లవుతున్నా, మండలంలోని ధర్మాపురం గ్రామానికి బీటీ రహదారి నిర్మించకపోవడం శోచనీయమని, ప్రజలు తగిన గుణపాఠం చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని టీపీసీసీ అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్ అన్నారు. గురువారం మండలంలోని ధర్మాపురం గ్రామ కచ్చా రహదారిని ఆయన పరిశీలించి మాట్లాడారు. అభివృద్ధి పనులు చేస్తున్నా.. ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నారని బీఆర్‌ఎస్ నాయకులు చెప్పడం సిగ్గుచేటని మానుకోవాలని హితవు పలికారు. అయూబ్‌ఖాన్, మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, విష్ణు, ఆంజనేయులు, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు తులసీరాజ్ పాల్గొన్నారు.

బీఎస్పీతోనే బతుకుల్లో మార్పు

అలంపూర్: బహుజనులకు బీఎస్పీ పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. అలంపూర్ చౌరస్తాలో బీఎస్పీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బీఎస్పీ నాయకులు డప్పు కళాకారులతో ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు అగ్రవర్ణాల పేదలు ఆకలి, ఆర్థిక, సామాజిక, అక్షర, ఆరోగ్య సమస్యలతో ఇబ్బందిపడుతున్నారని అన్నారు. పేదల స్థితిగతులు మారాలంటే సమాన హక్కులు రావాలన్నారు. అలంపూర్ నియోజకర్గంలో ఈ పరిస్థితులు మరింత దుర్భరంగా ఉన్నాయన్నారు. బీఎస్పీ కుల,మత బేధాలు లేకుండా అందరినీ సమానంగా చూస్తుందన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఎస్పీ పార్టీని భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కేశవరావు, జిల్లా ఇన్‌చార్జీ కృష్ణ, నాయకులు రవి చందర్, ప్రభుదాసు, శివ, లక్ష్మన్న, తిరుపాలు, జలంధర్, వెంకటేష్ ఉన్నారు.

శాంతినగర్‌లో చలివేంద్రం ప్రారంభించిన ఆర్‌ఎస్..

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీలోని ప్రధాన రహదారి సమీపంలో చలివేంద్రాన్ని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కేశవరావు, జిల్లా ఇన్‌చార్జ్ ఎంజి కృష్ణ, గద్వాల ఇన్‌చార్జ్ వెంకటరెడ్డి, గద్వాల అధ్యక్షుడు రాజు, అలంపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మధుసూదన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి రవిచందర్, ఇటిక్యాల, వడ్డేపల్లి, అయిజ, ఉండవెల్లి మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి చౌరస్తాలో బీఎస్పీ ఆధ్వర్యంలో గురువారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ హాజరై చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కేశవరావు, ఎంజీ కృష్ణ, మణికుమార్, తిరుపాలు, రాంబాబు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

పాన్‌గల్: మండలంలోని చిక్కేపల్లికి చెందిన అర్జున్‌గౌడ్, అలివేల, సువర్ణకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను గురువారం సర్పంచ్ బాలస్వామి యాదవ్, బీఆర్‌ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు వెంకట్రాములుయాదవ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్జున్‌గౌడ్‌కు రూ.1.40లక్షలు, అలివేలకు రూ.28వేలు, సువర్ణకు రూ.20వేల సీఎం సహాయనిధి చెక్కులు అందజేసినట్లు వారు పేర్కొన్నారు. సీఎం సహాయనిధితో పేద కుటుంబాలు కూడా కార్పొరేటు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకోగలుగుతున్నారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీను, రాము, ఖాదర్, బిచ్చాలు, వెంకటేష్, శ్రీను పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

గట్టు: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో రూ.30 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఆయన భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సీసీ రోడ్డు, డ్రైయినేజీలు, నూతన పంచాయతీ భవనాలు, వైకుంఠ ధామాలు, డంపింగ్ యార్డులు, పల్లె ప్రకృతి వనాలు, రైతు వేదికల భవనాలను నిర్మించామన్నారు. పట్టణాలకు దీటుగా పల్లెలను తీర్చుదిద్దుతామన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ రామన్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీధర్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు బల్గెర హనుమంతునాయుడు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, నాయకులు బజారి, రాము నాయుడు, కుర్మన్న, వీరారెడ్డి, కృష్ణ, తిమ్మప్ప, వెంకటేష్, ప్రాణేష్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న రెండు గిరకల పోటీలు

అమరచింత: శ్రీరామనవమిని పురస్కరించుకొని ఆత్మకూర్ మండలం మూలమళ్లలో గురువారం సాయంత్రం రెండు గిరకల ఎద్దులబండ్ల పోటీలు నిర్వహించారు. మొత్తం 32 ఎద్దులబండ్లు పాల్గొనగా.. పోటీలను ఆత్మకూర్ సీఐ రత్నం ప్రారంభించారు. రాత్రి వరకు కొనసాగిన పోటీల్లో మొదటి బహుమతిని నారాయణపేట జిల్లా అనుగొండకు చెందిన రాములుగౌడ్ గెలుచుకున్నారు.